క్లుప్తంగా

ఓటర్ల నమోదులో పారదర్శకత పాటించాలి

నర్సీపట్నం : ఓటర్ల నమోదు, తొలగింపు ప్రక్రియలో బూత్ లెవెల్ ఆఫీసర్లు తగు జాగ్రత్తలు పాటించాలని అసెంబ్లీ లెవెల్ మాస్టర్ ట్రైనర్ జయంత్ పేర్కొన్నారు. ఆర్డీవో కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం బూత్ లెవెల్ అధికారులకు ఓటర్ల నమోదుపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ ఎన్నికల కమిషన్ సూచనల మేరకు బూత్‌లెవెల్ అధికారులు పని చేయాలన్నారు. ఓటర్ల నమోదులో కానీ తొలగింపులో కానీ పొరపాట్లు తలెత్తకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎలక్షన్ డీటీ సుధావాణి పాల్గొన్నారు.

వివిధ పోటీల్లో విజేతలకు ఉపాధ్యాయుల అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం వరలక్ష్మి, ఉపాధ్యాయులు

రోలుగుంట : ప్రపంచ దినోత్సవం సందర్భంగా భీమిలిలో పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఆదేశాలతో పలు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు మండలం బుచ్చింపేట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల నుంచి విద్యార్థులు వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో పాల్గొని వారి ప్రతిభ చూపించారు. వేర్వేరు విభాగాల్లో నడిపింటి భాగ్యశ్రీ, ఇటంశెట్టి లలిత ద్వితీయస్థానంలో నిలిచారు. వీరిని డైట్ యాజమాన్యం సత్కరించి, ప్రోత్సాహక నగదుతో పాటు ప్రశంసాపత్రాలను అందజేశారు. జిల్లా స్థాయిలో తమ పాఠశాలకు గుర్తింపు తెచ్చినందుకు ఆయా విద్యార్థులను మంగళవారం హెచ్‌ఎం వరలక్ష్మి, విద్యా కమిటీ చైర్మన్ చిటికెల వెంకటరమణ, ఉపాధ్యాయ సిబ్బందితో కలసి అభినందించారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటును విరమించుకోవాలి



రోలుగుంటలో మాట్లాడుతున్న సీపీఎం అధ్యక్షుడు చిరంజీవి తదితరులు

రోలుగుంట: పేదల ఇళ్లల్లో చార్జీల భారం పెంచే స్మార్ట్‌మీటర్లు ఏర్పాటును విరమించుకోవాలని మండలంలో రోలుగుంట, కె.నాయుడుపాలెం గ్రామాల్లో సీపీఎం అధ్వర్యంలో మంగళవారం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండలపార్టీ అధ్యక్షుడు ఈ. చిరంజీవి మాట్లాడుతూ స్మార్ట్ మీటరు ఏర్పాటు విద్యుత్ సేవలను ప్రభుత్వం నుంచి తప్పించి కార్పొరేట్ సంస్థలకు దారి మళ్లించే ప్రయత్నం అని పేర్కొన్నారు. మధ్య తరగతి, బీద, బడుగు వర్గాల వారికి నష్టం చేకూర్చే ఈ విధానం వీడకుంటే ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

హామీలిచ్చి మోసగించడంలో చంద్రబాబు దిట్ట



కె.కోటపాడులో క్యూ ఆర్ కోడ్‌తో ఉన్న బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ ఫ్లెక్సీని విడుదల చేస్తున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



చీడికాడలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న బూడి

మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ధ్వజం

కె.కోటపాడు : ప్రజలకు తప్పుడు హామీలను ఇచ్చి మోసం చేయడంలో చంద్రబాబుకు ఎనలేని అనుభవం ఉందని మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. కె.కోటపాడులో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్ ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు చంద్రబాబు మేనిఫెస్టో గుర్తుకు తెచ్చే క్యూఆర్ కోడ్‌ను పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చంద్రబాబు గత ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చారని, ఈ పథకాలను అమలు చేయించే బాధ్యత తనదని పవన్ కళ్యాణ్ కూడా ప్రజలకు చెప్పారని అన్నారు. తీరా అధికారంలోకి వచ్చాక పథకాల ఊసే మరిచారని అన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో అర్హత గల వారు పెన్షన్‌కు పెట్టుకున్న నెల రోజులకే వారి అర్హతను బట్టి పింఛను మంజూరయ్యేదని, కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక వితంతువులకు కూడా నేటికీ కొత్త పింఛన్లు మంజూరు చేయలేదని అన్నారు. సీఎంగా జగన్ అన్న మాట ప్రకారం పెన్షన్ అర్హత వయస్సు 65 ఏళ్ల ఉన్నది 60 ఏళ్లకు తగ్గించి అందరికీ పింఛను అందించారని, చంద్రబాబు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు 50 ఏళ్లకే పింఛను ఇస్తామని చెప్పి ఒక్కరి నుంచి దరఖాస్తు స్వీకరించారా అని ప్రశ్నించారు. అన్నదాత సుఖీభవ పథకం కింద నేటి వరకూ కూటమి ప్రభుత్వం ఒక్క రుపాయిని కూడా పెట్టుబడి సహాయం కింద రైతులకు అందించలేదన్నారు. 18 నుండి 60 ఏళ్ల మహిళలు అందరికీ నెలకు రూ.1500 ఇవ్వనున్నట్లు ఆశ చూపి ఓట్లు వేయించుకున్నారని, బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అంటూ కల్లబొల్లి హామీలు ఇచ్చి నేటికీ అమలు చేయలేదన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని గ్రామస్థాయిలో విజయవంతం చేయాలని, 14 నెలల పాలనలో జరిగిన నష్టాన్ని అయా కుటుంబాల వారికి పార్టీ కార్యకర్తలు వివరించాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మాడుగుల నియోజకవర్గంలో ఎనలేని అభివృద్ధి జరిగిందన్నారు. గ్రామాలను కలుపుతూ ఉన్న మట్టిరోడ్లను తారురోడ్లుగా అభివృద్ధి చేశామని తెలిపారు. కోట్లాది రుపాయలతో చౌడువాడ, లంకవానిపాలెం పీహెచ్‌సీలకు నూతన భవనాల నిర్మాణాలు, కె.కోటపాడు సీహెచ్‌సీని రూ.5 కోట్ల 20లక్షలతో అదనపు భవనాలు, మౌలిక వసతులతో 50 పడకల స్థాయికి పెంచామన్నారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు, ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్ మాట్లాడుతూ మండలంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామన్నారు. మండల వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు గొర్రుపోటు వెంకటరావు, వైస్ ఎంపీపీలు రొంగలి సూర్యనారాయణ, లెక్కల నాగ విజయలక్ష్మి, మాజీ జెడ్పీటీసీ ఈర్లె గంగునాయుడు(నాని), పలు గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు బండారు ముత్యాలనాయుడు, ఆదిరెడ్డి సన్యాసినాయుడు, గంతకర్ల సతీష్, పొంతపల్లి రవినాయుడు, జాగరపు వెంకట రామలక్ష్మి, వేచలపు దొరబాబు, పైడినాయుడు, చీపురపల్లి అచ్చిబాబు, వర్రి వెంకటరావు, చల్లా మంగ, బండారు ముత్యాలనాయుడు, పల్లా రాజేశ్వరరావు, బంగారి లక్ష్మి, బండారు దేముళ్లు, ఏటుకూరి రాజేష్, ఆకుల ప్రసాద్, లెక్కల శంకరరావు, రొంగలి రమేష్, బండారు నారాయణపాత్రుడు, బోశం సందీప్, బోశం కృష్ణారావు, యడ్ల వెంకటరావు, లెక్కల దేవీలత, గొర్రుపోటు రామలక్ష్మి, వంటాకు అప్పాజీ, రంది రాజునాయుడు, తాడి సన్యాసమ్మ, ఆదిరెడ్డి వెంకటరావు, శ్రీకాంత్ శ్రీను, రొంగలి వెంకటరమణ, లాలం నాని, లగుడు దుర్గా ప్రసాద్, నెక్కల గోపి, పైల పైడితల్లమ్మ, వంటాకు అప్పాజి, రొంగలి రాము, ద్వారపూడి శ్రీను పాల్గొన్నారు.

ప్రశ్నిస్తానన్న పవన్ కళ్యాణ్ ఎక్కడ?

చీడికాడ : ఇచ్చిన మాట నిలబెట్టక పోతే నేను ప్రశ్నిస్తాను, నన్ను నమ్మి ఓటు వేయ్యండని చెప్పిన పవన్ కళ్యాణ్ నేడు ఎక్కడకు వెళ్లారని పీఏసీ సభ్యుడు, మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ప్రశ్నించారు. మంగళవారం చీడికాడలో జరిగిన వైఎస్సార్ సీపీ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. మోసపూరిత సూపర్–6 హామీలతో ప్రజలను మోసగించిన కూటమి ప్రభుత్వం గద్దెనెక్కి 14 నెలల్లో చేసిన అభివృద్ధి ఏమిటని ప్రశ్నించారు. జగనన్న ప్రభుత్వంలో విద్య, వైద్యంపై దృష్టి పెట్టి అమ్మ ఒడి, ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతిదీవెన అందించి, నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దారన్నారు. ఇటీవల నష్టపోతున్న మిర్చి, మామిడి, పొగాకు రైతులను జగన్ పరామర్శించేందు వెళ్లినపుడు జనం జగన్‌కు మద్దతుగా ఎన్ని ఆంక్షలు పెట్టినా పొలాలు,కొండలు,గుట్టలు,నదులు దాటుకుని వేలాదిగా వచ్చి సంఘీభావం తెలిపారన్నారు. 7, 8 నెలల్లో స్థానిక సంస్థల ఎన్నికలు జరగవచ్చు ఒక వేళ ఎన్నికలు పెట్టినా అన్ని స్థానాలు మనం గెలుచుకునేలా బలంగా మారాలన్నారు. ఈ సందర్భంగా క్యూర్ కోడ్ ఉన్న బోర్డులను ప్రదర్శించారు. మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు, ఎంపీపీ కురచా జయమ్మనారాయణమూర్తి, జెడ్పీటీసీ లాలం శారదా జానకీరాం, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికారప్రతినిధి, సీడీసీ చైర్మన్ సుంకర శ్రీనివాసరావు, పార్టీ యూత్ అధ్యక్షుడు గొల్లవిల్లి సన్యాసినాయుడు, చీడికాడ గ్రామశాఖ అధ్యక్షుడు పరువాడ అప్పారావు, నాయకులు పరువాడ మహేష్, చుక్కా అప్పలనాయుడు,వైస్ ఎంపీపీలు ధర్మిశెట్టి స్వాతికొండబాబు పాల్గొన్నారు.

వైద్యులు లేకుండా ఆస్పత్రి ప్రారంభోత్సవమా..?

- లాభాల్లో ఉన్న మహిళామార్టుకు అప్పులేంటి..?
- మండల సమావేశంలో అధికారులను నిలదీసిన సభ్యులు



సభలో సమస్యలను ప్రస్తావిస్తున్న మాజీ ఎంపీపీ రామధర్మజ

మాడుగుల : అటు ఏజెన్సీ ఇటు మైదానంలో సుమారు 90 గ్రామాలకు ఆధారమైన మాడుగుల 30 పడకల ఆసుపత్రిలో గైనకాలజిస్ట్, డెంటల్, ఆఫ్తాలమిస్ట్, ఫిజియోథెరపీ వైద్యులు లేకపోవడంతో నిరుపేద గిరి మహిళలు గర్భిణులు నరక యాతన పడుతున్నారని, సుమారు రూ.5 కోట్లతో నిర్మాణం చేపట్టిన కొత్త ఆసుపత్రి భవనంలో వైద్యులు లేకుండా ప్రారంభోత్సవం ఎలా చేస్తారని స్థానిక ప్రజాప్రతినిధులు మండల సభలో అధికారులను నిలదీశారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ వెంకటరాజారామ్ అధ్యక్షతన జరిగింది. ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ముఖ్యఅతిథిగా పాల్గొన్న సభలో సభ్యులు మండలంలోని పలు సమస్యలను ప్రస్తావించారు.

- సుమారు రూ.40 లక్షల పెట్టుబడితో సుమారు రూ.3 కోట్ల టర్నోవర్‌లో ఉన్న మహిళా మార్టు నేడు రూ.5 లక్షలు అప్పుల్లో కూరుకుపోవడానికి కారణమేమిటని వెలుగు ఏపీఎం రమణికుమారిని మాజీ ఎంపీపీ వేమవరపు రామధర్మజ ప్రశ్నించారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ లాభాల్లో ఉన్న మార్టు నష్టాలకు ఎవరు బాధ్యులో 15 రోజుల్లో తమకు నివేదిక అందజేయాలన్నారు. ఖరీఫ్‌లో వేసిన వరి విత్తనాలు సక్రమంగా నాటుకోలేదని, ఎండలు మండిపోవడంతో వ్యవసాయం దెబ్బతినే పరిస్థితులు ఉన్నాయని, సభ దృష్టికి గాదిరాయి సర్పంచ్ పెంటకోట జగన్నాథరావు తీసుకువచ్చారు. వ్యవసాయాధికారి అనసూయ మాట్లాడుతూ వారంరోజులు కురిసిన వర్షాలకు మొలక శాతం తగ్గిందని, విత్తన శుద్ధి తర్వాత విత్తనాలు పంపిణీ చేశామన్నారు. కనికరమాత కాలనీలో తాగునీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు.. మీకు ఆ కాలనీ ఎక్కడుందో తెలుసా, అక్కడికి ఒక్కసారైనా వెళ్లి సమస్యలు తెలుసుకున్నారా..? అని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈని మాజీ ఎంపీపీ రామధర్మజ, వైస్ ఎంపీపీ విజయలక్ష్మి ప్రశ్నించారు. ఆమెకు ఆ కాలనీ ఎక్కడుందో తెలియక పోవడంతో సమాధానం చెప్పలేకపోయారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే వెంటనే ఆ కాలనీకి వెళ్లి తాగునీటి సమస్య పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. శంకరం పంచాయతీలో మంచి నీటిపథకం పూర్తయినా కనెక్షన్ ఇవ్వలేదని శంకరం సర్పంచ్ శోలం రమేష్ తెలిపారు. మండలంలో చాలా వరకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు మరమ్మతులకు గురయ్యాయని ఎంపీపీ రాజారామ్, వైస్ ఎంపీపీ విజయలక్ష్మి, కింతలి ఎంపీటీసీ సన్యాసిరావు తెలిపారు. మాడుగులలో బీసీ వసతి గృహం భవనం శిథిలావస్థకు చేరిందని, మిగిలిన ఎస్టీ బాలికల, బాలుర వసతి గృహాలు అద్దె భవనాల్లో ఉన్నాయని వాటికి భవనాలు మంజూరు చేయాలని మాజీ ఎంపీపీ రామధర్మజ కోరారు. ఎమ్మెల్యే స్పందిస్తూ బీసీ బాలుర వసతి గృహానికి రూ.27 లక్షలు మంజూరైందని,, మిగిలిన వాటి భవన నిర్మాణాలకు స్థలం ఎంపిక చేయాలని డీటీ రాజాకు ఆదేశాలు చేశారు. జెడ్పీటీసీ రమణమ్మ, ఎంపీడీవో అప్పారావు, డీటీ ఎం.రాజా, ఐసీడీఎస్ పీవో శశికళ, నీటి సంఘం అధ్యక్షుడు అద్దేపల్లి జగ్గారావు, కింతలి పీఏసీఎస్ అధ్యక్షుడు ఉండూరు దేముడు, కోఆప్షన్ సభ్యురాలు షేక్ ఉన్నీషా, ఎంఈవో దేముడమ్మ, మాడుగుల ఎంపీటీసీ మహేశ్వరి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జిలు, మండల అధికారులు పాల్గొన్నారు.

హైడ్రో పవర్ ప్రాజెక్టు అనుమతులు రద్దు చేయాలి



సమ్మెదలో గిరిజనులతో కలిసి నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దొరబాబు

దేవరాపల్లి : గిరిజనుల జీవితాలను నాశనం చేసే అధాని హైడ్రో పవర్ ప్రాజెక్టు అనుమతులను రద్దు చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు డిమాండ్ చేశారు. సమ్మెద, చింతలపూడి, బల్లిపురం, మారిక, తామరబ్బ, పల్లపుకోడాబు, కొండకొడాబు గ్రామాలలో సీపీఐ బృందంతో కలిసి మంగళవారం ఆయన పర్యటించారు. ఈ ప్రాజెక్టు నిర్మిస్తే కలిగే అనర్థాలను గిరిజనులకు వివరించి వారికి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గిరిజనులు వ్యతిరేకించే ఈ ప్రాజెక్టును నిర్మిస్తే స్థానిక గిరిజనులతో కలిసి ఉద్యమం ఉధృతం చేస్తామన్నారు. రైవాడ క్యాచ్‌మెంట్ ఏరియాలో హైడ్రో పవర్ ప్లాంట్‌కు అనుమతులు ఇవ్వడంతో రైవాడపై ఆధారపడిన వేలాది ఎకరాలు బీడు భూములుగా మారుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ హైడ్రో పవర్ ప్లాంట్ నిర్మాణానికి ప్రభుత్వం ఇచ్చిన జీవో నెంబర్ 51తో రైవాడ ఆయకట్టు రైతులతో పాటు గిరిజనుల భవిష్యత్ అగమ్యగోచరంగా మారుతుందని అన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి గిరిజనులకు తీవ్ర నష్టం చేకూర్చే హైడ్రో పవర్‌ప్లాంట్ అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా నాట్య మండలి జిల్లా ప్రధాన కార్యదర్శి గొర్లి దేముడు బాబు, సీపీఐ మండల కార్యదర్శి వేమల కన్నబాబు, చింతలపూడి సర్పంచ్ దొమ్మంగి బోడెమ్మ, జగన్నాథం నాయుడు, వీరన్నదొర పాల్గొన్నారు.

బ్యాంకు లింకేజీతో రూ.193 కోట్ల రుణాల పంపిణీ

- యూనిట్లు ఏర్పాటు చేస్తేనే రుణాలు మంజూరు
- డీఆర్‌డీఏ పీడీ శచీదేవి వెల్లడి




సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తున్న పీడీ శచీదేవి

మాకవరపాలెం : జిల్లాలో బ్యాంకు లింకేజీ ద్వారా 39,400 గ్రూపులకు రూ.193 కోట్లు రుణాలు అందించామని డీఆర్‌డీఏ పీడీ శచీదేవి తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మంగళవారం సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 4 లక్షల 4 వేల మంది డ్వాక్రా మహిళలున్నారన్నారు. వీరికి ఈ ఏడాది రూ.900 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు ఇవ్వడమే లక్ష్యమన్నారు. ఇప్పటివరకు రూ.193 కోట్లు ఇచ్చామని, స్త్రీ నిధి ద్వారా రూ.221 కోట్లు లక్ష్యం కాగా రూ.39 కోట్లు రుణంగా పంపిణీ చేశామన్నారు. రుణాలు అవసరమైన మహిళల వివరాలను ఇప్పటికే సిబ్బంది ద్వారా సర్వే చేయించామన్నారు. దశల వారీగా వారికి రుణాలు ఇస్తున్నట్టు చెప్పారు. రుణాలు పొందిన మహిళలు గతంలో మాదిరిగా గేదెలు, మేకలు, గొర్రెలు కాకుండా ఎంబ్రాయిడింగ్, కొవ్వొత్తుల తయారీ, పిండి వంటలు, పేపర్ ప్లేట్లు, ఫుడ్ యూనిట్లు, ఫొటో స్టూడియో, చిన్న చిన్న పరిశ్రమలు వంటివి ఏర్పాటు చేసి కనీసం ఒక్కరికైనా ఉపాధి చూపాలన్నారు. ఈ యూనిట్లు పరిశీలించిన తరువాతే రుణాలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. అనంతరం మండల కేంద్రంలో నిర్వహిస్తున్న కొవ్వొత్తులు, పిండి వంటల తయారీ యూనిట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం మంగ, సీసీలు పాల్గొన్నారు.

జీవో 117ను రద్దు చేయాలి

చోడవరం: ప్రభుత్వ పాఠశాలలను ధ్వంసం చేస్తున్న జీవో నెంబరు 117 రద్దు చేయాలని, తల్లికి వందనం పథకం అందరికీ అమలు చేయాలని కోరుతూ పీడీఎస్‌వో ఆధ్వర్యంలో చోడవరం మెయిన్ హైస్కూలు విద్యార్థులతో మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమములో పీడీఎస్‌వో రాష్ట్ర అధ్యక్షుడు భాస్కర్ మాట్లాడుతూ మేము అధికారంలోకి వస్తే జీవో 117 రద్దు చేస్తామని, ప్రభుత్వ పాఠశాలను పటిష్టం చేస్తామని యువగళం పాదయాత్రలో హామీ ఇచ్చిన రాష్ట్ర విద్యాశాఖామంత్రి నారా లోకేశ్ ఈ హామీని ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వసతి గృహల్లో మెస్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు.

ఎనర్జీ అసిస్టెంట్లను విద్యుత్ సంస్థలో విలీనం చేయాలి



ఈపీడీసీఎల్ జీఎంకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

చోడవరం : జేఎల్‌ఎం గ్రేడ్ 2 ఎనర్జీ అసిస్టెంట్లకు సంబంధించి విద్యుత్ సంస్థలో విలీనం చేయాలని, పదోన్నతులు ఇవ్వాలని పలువురు ఎనర్జీ అసిస్టెంట్లు మంగళవారం విశాఖలో ఈపీడీసీఎల్ జనరల్ మేనేజర్ డి.సుమన్ కళ్యాణికి వినతి పత్రం అందజేశారు. జేఎల్‌ఎం గ్రేడ్ 2 ఎనర్జీ అసిస్టెంట్లను విద్యుత్ సంస్థలో పూర్తిగా విలీనం చేసి, సహాయ లైన్‌మేన్‌లుగా పదోన్నతులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు వేపాడ సత్యనారాయణ, రాష్ట్ర కమిటీ సభ్యుడు ఆర్.సత్యారావు, పి. శ్రీనివాసరావు, చంద్రశేఖర్, అప్పలరాజు, శంకరావు, ఆదినారాయణ పాల్గొన్నారు.

మాకు రెగ్యులర్ ఎంఈఓని నియమించండి



సమస్యలు వివరిస్తున్న మండల యూటీఎఫ్ నేతలు

రావికమతం : మండలంలో రెగ్యులర్ ఎంఈఓని నియమించాలని కోరుతూ మండల యూటీఎఫ్ అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి గెంజి నాగేశ్వరరావు, పోలిన అప్పారావు మంగళవారం డిమాండ్ చేశారు. రావికమతం మండలంలో ఎంఈఓ–1గా సిహెచ్. తలుపులు విధులు నిర్వహిస్తున్నారు. ఆయన నర్సీపట్నం రెగ్యులర్ ఎంఈఓగా, రావికమతం మండలం ఎంఈఓ–1గా విధులు నిర్వహించడం వల్ల పని ఒత్తిడి ఎక్కువగా ఉండడంతో మండలంలో 36 మంది ఉపాధ్యాయులకు జీతాలు పెట్టలేకపోయారని తెలిపారు. తక్షణమే మండలానికి రెగ్యులర్ ఎంఈవోని నియమించాలని కోరారు.

అంతర్గత నైపుణ్యాలు పెంపొందించుకోవాలి



విద్యార్థులకు పోత్సాహక బహుమతులు అందిస్తున్న హెచ్‌ఎం శేషగిరిరావు

రోలుగుంట : ప్రతి విద్యార్థి తమలోని అంతర్గత నైపుణ్యాలు పెంపొందించుకొని తద్వారా సమాజాభివృద్ధికి తోడ్పాటు అందించాలని హెచ్‌ఎం టి.వి. శేషగిరిరావు అన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రపంచ యువత నైపుణ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బయాలజీ, ఆంగ్ల ఉపాధ్యాయులు విజయరాణి, నాగజ్యోతి వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు, ఆరోగ్య విద్య ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన సృజనాత్మక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులకు హెచ్‌ఎం శేషగిరిరావు, సోషల్ టీచర్ శర్మ ప్రోత్సాహక బహుమతులను అందజేశారు.

ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌లో అగ్నిప్రమాదం



గర్నికంలో ప్రమాదం జరిగిన ఫాస్ట్‌ఫుడ్ సెంటర్

రావికమతం : మండలంలో గర్నికం తిరుమల కల్యాణ మండపం సమీపంలో గల దుర్గా ఫాస్ట్ ఫుడ్ సెంటర్లో మంగళవారం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. గ్యాస్ స్టౌ నుంచి సిలిండర్‌ను కదుపుతున్న సమయంలో పైపు నుంచి గ్యాస్ లీకై మంటలు చేలరేగి ఈ ప్రమాదం సంభవించిందని, తక్షణమే సమీపంలో గల అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించామని ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ యజమాని తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది, సెంటర్‌లో పనిచేస్తున్న సిబ్బంది కలిసి మంటలను అదుపు చేయడంతో పెద్ద ప్రమాదం తప్పిందని తెలిపారు.

ప్రభుత్వానికి దిమ్మతిరిగేలా స్మార్ట్ మీటర్లపై ఉద్యమించాలి



స్మార్ట్ మీటర్లు వద్దంటూ ప్రచారం చేస్తున్న సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు అడిగర్ల రాజు తదితరులు

నాతవరం : ఇళ్లకు స్మార్ట్ మీటర్లు బిగించకుండా అడ్డుకుని నారా లోకేష్‌కు దిమ్మతిరిగేలా ఉద్యమించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు అడిగర్ల రాజు అన్నారు. నాతవరం గ్రామంలో మంగళవారం సాయంత్రం మా ఇంటికి స్మార్ట్ మీటర్లు బిగించవద్దు... అన్న స్టిక్కర్లు, కరపత్రాలు పంచి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు నారా లోకేష్ స్మార్ట్ మీటర్లు పెడితే పగులగొట్టమని చెప్పాడని, ఇప్పుడు అధికారంలోకి వచ్చాక అయనే స్వయంగా మీటర్లు పెట్టమనడం దారుణమన్నారు. విద్యుత్‌శాఖకు సంబంధం లేకుండా ప్రస్తుతం దొంగ చాటుగా అదానీ మనుషులు స్మార్ట్ మీటర్లు ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారన్నారు. ఇప్పటికే వ్యాపార సముదాయాలకు ఏర్పాటు చేసిన స్మార్ట్ మీటర్ల కారణంగా బిల్లులు రూ.వేలల్లో, రూ.లక్షల్లో రావడంతో వారంతా గగ్గోలు పెడుతున్నారని, ఎట్టి పరిస్థితుల్లో ఇళ్లకు స్మార్ట్ మీటర్లు బిగించకుండా ఐక్యతగా అడ్డుకోవాలన్నారు.

మామిడిపల్లిలో రూ.5 లక్షలతో సీసీ డ్రైనేజీ నిర్మాణం



భూమి పూజ చేస్తున్న జెడ్పీటీసీ కర్రి సత్యం, వైస్ ఎంపీపీ పంచాడ, సర్పంచ్ సూరినాయుడు

దేవరాపల్లి : మండలంలోని మామిడిపల్లిలో డ్రైనేజీ నిర్మాణానికి జిల్లా పరిషత్ నిధులు రూ. 5 లక్షలు మంజూరు చేశామని స్థానిక జెడ్పీటీసీ కర్రి సత్యం అన్నారు. ఈ మేరకు మామిడిపల్లి గ్రామంలో ఈ నిధులతో డ్రైనేజీ నిర్మాణ పనులకు స్థానిక సర్పంచ్ కర్రి సూరినాయుడు, వైస్ ఎంపీపీ పంచాడ సింహాచలం నాయుడుతో కలిసి మంగళవారం ఆయన భూమి పూజ చేశారు. కళారెడ్డి దేముడు ఇంటి నుంచి రాధాకృష్ణ చెరువు వరకు సుమారు 100 మీటర్ల మేర సీసీ డ్రైనేజీని నిర్మిస్తున్నట్టు జెడ్పీటీసీ సత్యం తెలిపారు. ఈ సందర్భంగా పొక్లెయిన్‌తో డ్రైనేజీ నిర్మాణానికి మట్టి తవ్వే పనులను వారు ప్రారంభించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ చల్లా సుధాకర్, జూరెడ్డి గోవింద, నెక్కొళ్ల నాయుడు, చల్లా మహేశ్వరరావు, పంచాడ మంగునాయుడు, నాళం శ్రీనివాసనావు, నౌడు గణేష్ పాల్గొన్నారు.

వడ్డాదిలో ఘనంగా మోదకొండమ్మ పండగ



వడ్డాదిలో పూజలందుకున్న మోదకొండమ్మ



వడ్డాదిలో నేలవేషాలు, అమ్మవారి ఘటాలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

బుచ్చెయ్యపేట : మండలంలో గల మేజర్ పంచాయతీ వడ్డాదిలో గ్రామదేవత మోదకొండమ్మ పండగను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు అమ్మవారి ఆలయానికి తరలివెళ్లి మొక్కులు తీర్చుకున్నారు. పలువురు అమ్మవారి ఘటాలతో నేల వేషాలు, డప్పులు, వాయిద్యాలు, బాణసంచా వెలుగుల నడుమ ఊరేగింపుగా ఆలయానికి తరలివెళ్లారు. ఆలయంలో కుంకుమ పూజలు, ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామస్తులంతా ఒకేసారి అమ్మవారి ఘటాలతో ఆలయానికి తరలివెళ్లడంతో చుట్టాలు, బంధువుల కలయికతో గ్రామంలో సందడి నెలకొంది.

చెరువుల అభివృద్ధితోనే రైతులకు మేలు



మాట్లాడుతున్న ప్రపంచ బ్యాంకు ప్రతినిధి వెంకటరావు



ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తిని పెంచేలా కూరగాయలతో ఏర్పాటు చేసిన చిత్రం

కోటవురట్ల : చెరువుల అభివృద్ధితో రైతులకు మేలు కలుగుతుందని, తద్వారా మేలైన పంటల సాగుతో ఆర్థికంగా నిలదొక్కుకునే అవకాశం ఉంటుందని ప్రపంచ బ్యాంకు ప్రతినిధి, సీనియర్ సోషల్ డెవలప్‌మెంట్ స్పెషలిస్టు బి.వెంకటరావు అన్నారు. సుంకపూరు గ్రామంలో ఆంధ్రప్రదేశ్ సమీకృత నీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో వ్యవసాయ పరివర్తన కార్యక్రమంలో భాగంగా ప్రపంచ బ్యాంకు ప్రతినిధులతో మంగళవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. తొలుత పెద్ద చెరువును బృందం సభ్యులు పరిశీలించి స్థానిక అధికారులు, రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. అనంతరం జరిగిన అవగాహన సభలో ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు మాట్లాడుతూ ఈ గ్రామానికి ఇక్కడ ఉన్న చెరువు వ్యవసాయానికి కేంద్రబిందువు అవుతుందన్నారు. ఈ చెరువును గతంలో ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు 2018–19లో సందర్శించి అభివృద్ధికి రూ.97 లక్షలు మంజూరు చేశారన్నారు. ఆ నిధులతో స్లూయిజ్‌లు, పొర్లుగట్లు నిర్మించి చెరువును అభివృద్ధి చేశారన్నారు. దీని పరిధిలో 416 ఎకరాలకు సాగునీరు అందేలా చెరువును అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. గ్యాప్ ఆయకట్టు మరమ్మతులు చేపట్టడం ద్వారా శివారు భూములు 160 ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉందని తెలిపారు. సాగులో ఆదునిక పద్ధతులను అవలంభించాలని, రసాయనాల పిచికారీకి డ్రోన్ స్ప్రేయర్‌ను వినియోగించాలని సూచించారు. ప్రపంచ బ్యాంకు ప్రతినిధి చీఫ్ అమాడోవ్, ఏపీఐఐఏటీపీ ఎస్ఈ ఎంఎస్‌వి వేణుగోపాల్, గ్రౌండ్ వాటర్ జేడీ కెఎస్ శాస్త్రి, హార్టీకల్చర్ డీడీ సుబ్బారావు, ఈఈ ఎం రేవతి, అగ్రి బిజినెస్ మస్తాన్‌రావు, డీపీడీ రాజేశ్వరరావు, డీఈలు రాజేంద్రకుమార్, జనార్ధన్, జేఈలు సూర్యకుమారి, రాంజీ, జోజిబాబు, రామకృష్ణ, సంతోష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

మధ్యవర్తిత్వం ద్వారా కేసుల సత్వర పరిష్కారం


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి లావణ్య

మాడుగుల రూరల్ : కోర్టులో వున్న కేసులకు సంబంధించి, రాజీకి అవకాశం వున్న వివాదాలను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించేందుకు కక్షిదారులు ముందుకు రావాలని, మాడుగుల మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, స్థానిక కోర్టు సివిల్ జడ్జి ఎస్.లావణ్య పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం మాడుగుల కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ కోర్టు సివిల్, క్రిమినల్ కేసులకు సంబంధించి, తక్కువ సమయంలో పరిష్కరించడానికి అవకాశాలను ఈ సందర్భంగా వివరించారు.

కె.కోటపాడు గ్రామ వార్డు సభ్యులకు సన్మానం


కె.కోటపాడు వార్డు సభ్యులను సన్మానిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

కె.కోటపాడు : కె.కోటపాడు గ్రామ పంచాయతీకి చెందిన వైఎస్సార్‌సీపీ మద్దతుదారులైన 12 మంది వార్డు సభ్యులను మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సన్మానించారు. కె.కోటపాడులో గ్రామ ఉప సర్పంచ్ రెడ్డి అరుణతో పాటు వార్డు సభ్యులకు మంగళవారం దుశ్శాలువాలను వేసి సన్మానించారు. వార్డు ప్రజలకు సేవ చేయడంతో పాటు గ్రామాభివృద్ధిలో భాగస్వాములై మరింతగా ప్రజల మన్ననలు పొందాలని బూడి ముత్యాలనాయుడు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, శ్రీకాంత్ శ్రీను, బండారు నారాయణపాత్రుడు, దోకల అప్పలనాయుడు, లగుడు దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

పాడి పశువులకు థైలేరియా టీకాలు తప్పనిసరి


దేవరాపల్లిలో థైలేరియా టీకా కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న పశువైద్యాధికారి గాయిత్రీదేవి

దేవరాపల్లి : పాడి పశువులకు థైలేరియా టీకాలు తప్పనిసరిగా వేయించాలని మండల పశు వైద్యాధికారి జి.గాయిత్రీదేవి సూచించారు. దేవరాపల్లి, ఎం.అలమండ గ్రామాలలో మంగళవారం జరిగిన టీకాల కార్యక్రమాన్ని ఆమె పర్యవేక్షించారు. ఈ వ్యాధి సోకిన పశువుకు తీవ్రమైన జ్వరం, నీరసం ఉంటుందని, తద్వారా పాల దిగుబడి బాగా తగ్గిపోతుందన్నారు. ఈ వ్యాధి సంకరజాతి ఆవుల్లో ఎక్కువగా కనిపిస్తుందని, ఈ క్రమంలోనే ముందస్తు జాగ్రత్తలో భాగంగా థైలేరియా నివారణ టీకాలను సంకరజాతి ఆవులకు వేస్తున్నామని వైద్యాధికారి గాయిత్రీదేవి తెలిపారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది సురేష్ పాల్గొన్నారు.

తారువలో వైఎస్సార్‌సీపీ మండల విస్తృత స్థాయి సమావేశం రేపు

దేవరాపల్లి : దేవరాపల్లి మండల వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశాన్ని తారువలో గురువారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహిస్తున్నట్టు మండల పార్టీ అధ్యక్షుడు బూరె బాబురావు తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా వైఎస్సార్‌సీపీ పొలిటికల్ అడ్వైజర్ కమిటీ సభ్యులు, మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు హాజరవుతారన్నారు. ఈ సమావేశానికి మండలంలోని ఎంపీపీ, జెడ్పీటీసీతో పాటు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

ఏఎల్‌పురంలో పారిశుధ్య పనులు


కాల్వలు శుభ్రం చేస్తున్న సిబ్బంది

గొలుగొండ: ఏఎల్‌పురం మేజర్ పంచాయతీలో పారిశుధ్య పనులు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. ప్రధాన వీధుల్లో కాలువల వద్ద మురుగునీరు నిలిచిపోవడంతో వాటిని శుభ్రం చేయిస్తున్నారు. సర్పంచ్ లోచల సుజాత ఆధ్వర్యంలో పంచాయతీ పాలకులు పనులు పర్యవేక్షిస్తున్నారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా తాగునీరు, పారిశుద్యం సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నట్టు సర్పంచ్ తెలిపారు.

ఏలేరు లీకేజీలకు అడ్డుకట్టేది?

ఏలేరు లీకేజీలకు అడ్డుకట్ట పడడం లేదు. దీని కోసం రూ.కోట్లు వ్యయం చేసినా ఫలితం లేకుండా పోయింది. తూతూ మంత్రంగా చేసిన పనులతో ఏలేరు ప్రవాహానికి లీకేజీలు గండి కొడుతున్నాయి. అక్విడెక్టుల నుంచి నిత్యం భారీగా నీరు వృధాగా పోతున్నా పట్టించుకునే వారు కానరావడం లేదు.

- అక్విడెక్టులకు రంధ్రాలు
- నిత్యం భారీగా వృథా అవుతున్న నీరు
- నెరవేరని సరఫరా లక్ష్యం

మాకవరపాలెం : విశాఖ నగరంలోని ప్రజల తాగునీరు, స్టీల్ ప్లాంట్ అవసరాలకు నీరందించే ఏలేరు కాలువకు రోజురోజుకూ లీకేజీల బెడద అధికమవుతోంది. ఏలేశ్వరం నుంచి విశాఖ వరకు 153 కిలోమీటర్లు పొడవునా ఉన్న ఈ కాలువ ద్వారా నిత్యం 80–90 ఎంజీడీల నీరు సరఫరా చేయాలనే లక్ష్యం ఉన్నా.. అక్విడెక్టుల కారణంగా నీరు వృథాగా పోతుండడంతో ఈ లక్ష్యం నీరుగారుతోంది. ఎక్కడబడితే అక్కడ అక్విడెక్టులకు రంధ్రాలు పడి నీరు గెడ్డలపాలవుతోంది.

ఏడాది కాకముందే లీకులు..

ఏలేరు కాలువలో డీప్ కట్ల వద్ద ఉన్న పూడిక తొలగింపు, అక్విడెక్టులకు పడిన రంధ్రాలకు మరమ్మతులు చేసే పనులకు గతంలో రూ.3 కోట్లు మంజూరు చేశారు. ఈ నిధులతో డీప్ కట్ల వద్ద పూడిక తొలగింపుతో పాటు అక్విడెక్టులకు పడిన రంధ్రాలకు మరమ్మతులు చేశారు. మండలంలోని లచ్చన్నపాలెం వద్ద సర్పానదిపై ఉన్న అక్విడెక్టుకు రూ.లక్షల్లో ఖర్చు చేసి మరమ్మతులు చేశారు. పనులు పూర్తి చేసిన రెండో నెల నుంచే మళ్లీ నీరు లీకేజీలు ప్రారంభమయ్యాయి. ఈ లీకేజీలు రోజురోజుకూ పెరిగి భారీగా సర్పానది పాలవుతోంది.


లచ్చన్నపాలెం వద్ద సర్పానదిపై అక్విడెక్టు నుంచి లీకవుతున్న నీరు

నెరవేరని నీటి సరఫరా లక్ష్యం..

నిత్యం విశాఖకు కాలువ ద్వారా 80–90 ఎంజీడీల వరకు నీరు సరఫరా చేయాల్సి ఉంది. కానీ అక్విడెక్టు లీకేజీలు, కాలువలో పేరుకుపోయిన గుర్రపు డెక్క, గడ్డి, నాచు కారణంగా నీటి సరఫరా లక్ష్యం చేరడం లేదు. దీంతోపాటు కాలువ లైనింగ్ పక్కగా ఉన్న మట్టి, ఇతర వ్యర్థాల కారణంగా కాలువలో పూడిక పేరుకుపోవడం కూడా నీటి సరఫరా లక్ష్యానికి గండికొడుతున్నాయి.


కాలువలో పేరుకుపోయిన గుర్రపుడెక్క, గడ్డి

సరఫరా నిలిపివేశాకే మరమ్మతులు..

కాలువలో అధిక నీటి ప్రవాహం కారణంగా జాయింట్ల నుంచి నీరు లీకవడం సాధారణం. పెద్ద రంధ్రాలుంటే నీటి సరఫరాను నిలిపివేసి మరమ్మతులు చేయాల్సి ఉంది. కాలువ నిర్వహణలో భాగంగా గట్లను ఆనుకుని ఉన్న గుర్రపు డెక్క, ఇతర వ్యర్థాలను తొలగించే పనులు జరుగుతున్నాయి. మరో ఐదు రోజుల్లో మాకవరపాలెం మండల పరిధికి చేరుకుంటాయి. – వెంకటరావు, ఏఈ, జీవీఎంసీ

మన రహదారిని మనమే బాగు చేసుకుందాం

- నడుం బిగించిన గిరిజనులు
- శ్రమదానంతో గోతుల పూడ్చివేత పనులు


వైబీ పట్నం–పెదగరువు మార్గంలో గోతులు పూడ్చివేత పనులు చేస్తున్న పెదగరువు గిరిజనులు

రోలుగుంట : ఎవరో వస్తారని, ఏదో చేస్తారని ఎదురు చూసే కన్నా మన రహదారి కష్టాలు మనమే మెరుగుపరుకుందాం అని కొండ శిఖరాగ్రాన ఉన్న గిరిజన గ్రామాల వారు నిర్ణయించుకున్నారు. మంగళవారం అర్ల పంచాయతీ శివారు పెదగరువు గ్రామంలో గల 12 కుటుంబాల వారు నడుం బిగించారు. వైబీ పట్నం నుంచి లోసింగి మీదుగా పెదగరువు వరకూ రెండు కిలోమీటర్ల మేర రాకపోకలకు అనువుగా ఉండే విధంగా గోతులు పూడ్చి చదును చేశారు. ఈ సందర్భంగా ఈ పనుల్లో పాల్గొన్న వారిలో కిల్లో నరసయ్య, కిల్లో మహేష్ మాట్లాడుతూ ఈ రోడ్డుకి ఉపాధి పథకం కింద గత ప్రభుత్వం హయాంలో రూ.2.50 కోట్లు మంజూరు కాగా ఈ పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ కొంత వరకూ పనులు చేసి వదిలేశారని తెలిపారు. గత నెలలో కురిసిన వర్షాలకు రోడ్డు ఎడ్జ్‌లు దెబ్బతినడంతో పాటు రోడ్డుపై గోతులు ఏర్పడ్డాయి. దీంతో రాకపోకలకు అధ్వానంగా మారింది. ఇదిలా ఉండగా తమ గ్రామానికి చెందిన పాంగి సాయిని నెలలు నిండడంతో ప్రసవానికి పీహెచ్‌సీకి తరలించడానికి డోలి మోతతో కుటుంబీకులు ఆమెను కిందికి తీసుకువస్తుండగా మార్గమధ్యంలో తుప్పల్లోనే ఆమె ప్రసవించిన విషయం విదితమే. ప్రస్తుతం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పాంగి సాయి, బుచిలను తాము గోతులు కప్పి చదును చేసిన ఈ రోడ్డులో తమ గ్రామానికి తల్లీబిడ్డల ఎక్స్‌ప్రెస్‌లో తరలించాలని వారు కోరారు. ఇలా ఉండగా గిరిజనుల వైద్యం కోసం జిల్లా కలెక్టర్ ఆదేశాలతో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేయడంపై కొండ శిఖరాగ్రాన ఉన్న గిరిజనులు కృతజ్ఞతలు తెలిపారు.

డిప్యూటీ ఎంపీడీవోగా మూర్తిబాబు


డిప్యూటీ ఎంపీడీవో మూర్తిబాబుకు శుభాకాంక్షలు తెలుపుతున్న పంచాయతీ కార్యదర్శులు

నాతవరం : మండల డిప్యూటీ ఎంపీడీవోగా కిల్లి మూర్తిబాబు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఎస్.ఎస్.ఎం. మూర్తి అల్లూరి సీతారామరాజు జిల్లా డుంబ్రిగుడ మండలానికి బదిలీపై వెళ్లారు. ఈయన మాడుగుల మండల కేంద్రం పంచాయతీ ఈవోగా పని చేస్తూ పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన మూర్తిబాబును మండలంలో గల పంచాయతీ కార్యదర్శులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, ఎంపీడీవో కె.ఉషాశ్రీని మర్యాదపూర్వకంగా మూర్తిబాబు కలిశారు. అనంతరం అయన మాట్లాడుతూ పంచాయతీల్లో అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు సకాలంలో అందించడం, పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్ సమస్యలపై దృష్టి సారిస్తానని తెలిపారు. పంచాయతీ పాలకవర్గ సమావేశాలు సకాలంలో జరిపించడం పాటు సర్పంచుల సహాయ సహకారాలతో పంచాయతీల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

తాండవ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు

నాతవరం : మండల కేంద్రం నుంచి తాండవ రిజర్వాయరుకు వెళ్లే అర్అండ్‌బీ రోడ్డు నిర్మాణం చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని నర్సీపట్నం ఆర్అండ్‌బీ డీఈ విద్యాసాగర్ అన్నారు. ఆయన మంగళవారం సాయంత్రం జేఈ నాయుడుతో కలిసి తాండవ వెళ్లే రోడ్డును పరిశీలించి గ్రామస్థులతో మాట్లాడారు. నాతవరం నుంచి తాండవ వరకు సుమారుగా ఏడుకిలోమీటర్లున్నర రోడ్డు ఇంతవరకు ఇరిగేషన్‌శాఖ పరధిలో ఉండేదన్నారు. ఇటీవల ఈరోడ్డు అర్అండ్‌బీ శాఖకు విలీనం అయిందన్నారు. ప్రస్తుతం ఈరోడ్డుకు మరమత్తులకు రూ.కోటి 40లక్షలు నిధులు అవసరమన్నారు. ఉన్నతాధికారుల అదేశాలు ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

మోదమాంబ జాతర గోడపత్రిక విడుదల


కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో జాతర గోడపత్రికను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే బండారు

మాడుగుల రూరల్ : మండలంలో కె.జె.పురం గ్రామంలో ఈ నెల 20 వ తేదీన జరిగే మోదమాంబ అమ్మవారి జాతరకు సంబంధించిన గోడపత్రికను విడుదల చేశారు. కె.జె.పురం జంక్షన్‌లో గల కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో మంగళవారం ఉదయం గోడపత్రికను స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి చేతుల మీదుగా విడుదల చేశారు. జాతరను విజయవంతం చేయాలని జాతర ఉత్సవ కమిటీ చైర్మన్ రాపేట జోగినాయుడు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షుడు, సర్పంచ్ జామి రమణబాబు, ఉత్సవ కమిటీ ఉపాధ్యక్షుడు రాపేట రాజశేఖర్‌నాయుడుతో పాటు పీఏసీఎస్ చైర్‌పర్సన్ శరగడం ఆదిబాబు, కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ సభ్యులు పుట్టా రాంబాబు, యల్లపు రాము, కాళ్ల నర్సింగరాజుతో పాటు పెద్దేరు జలాశయం చైర్మన్ అద్దిపల్లి జగ్గారావు, నాయకులు పుప్పాల రమేష్, పాలకుర్తి శ్రీనివాసరావు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో ఎన్నో అవకతవకలు

పీడీకి పలువురు బాధితుల ఫిర్యాదులు


పీడీ పూర్ణిమాదేవికి అవకతవకలపై ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

బుచ్చెయ్యపేట : వడ్డాదిలో జాతీయ ఉపాధి హామీ పథకం పనుల్లో పలు అవకతవకలు జరుగుతున్నాయని వడ్డాది గ్రామస్తులు పీడీ పూర్ణిమాదేవికి ఫిర్యాదు చేశారు. మంగళవారం ఆమె వడ్డాదిలో ఉపాధిహామీ పథకంలో చేపట్టిన పలు రకాల పనులను ఆమె పరిశీలించారు. గ్రామానికి చెందిన బూసి కోటి వరహాలు తాను ఏర్పాటు చేసుకున్న పట్టు పరిశ్రమకు రూ.6 లక్షలు మెటీరియల్ కాంపౌండ్ నిధులు అధికారులు అందించలేదని పీడీకి ఫిర్యాదు చేశారు. గ్రామంలో తన పొలంలో ఉపాధిహామీ పథకంలో కొబ్బరి మొక్కలు నాటగా టెక్నికల్ అసిస్టెంట్ నిధులు వేరే వ్యక్తిపై డ్రా చేశారని రైతు సయ్యపురెడ్డి మాధవరావు పీడీకి ఫిర్యాదు చేశారు.

దివ్యాంగులు మామిడి అప్పలకొండ, లంక బాలక్రిష్ణ తదితరులు తమకు ఉపాధి పనులు కల్పించడం లేదని, అధికారులను పనుల గురించి అడిగితే దురుసుగా ప్రవర్తిస్తున్నారని పీడీకి ఫిర్యాదు చేశారు. 50 ఏళ్లు దాటిన వారికి ఉపాధి పనులు చెప్పకపోగా పలు రకాల ఉపాధి పనుల్లో అవకతవకలు జరిగాయని, పూర్తి స్థాయిలో విచారణ చేయాలని పీడీకి ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేసి పై అధికారుల దృష్టికి తీసికెళ్లి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని పీడీ వారికి తెలిపారు.

వృత్తి విద్య నైపుణ్యంతో భవిష్యత్‌కు భరోసా

- బేతపూడి కేజీబీవీ ప్రిన్సిపాల్ భువనమాధురి
- కళాశాలలో ఘనంగా ప్రపంచ నైపుణ్య దినోత్సవం


బేతపూడి కేజీబీవీలో వృత్తి విద్యా కోర్సుల ప్రాధాన్యం తెలిపే ప్లకార్డులను ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

దేవరాపల్లి : వృత్తి విద్యలో నైపుణ్యం సాధించడం ద్వారా భవిష్యత్‌కు నిండైన భరోసా లభిస్తుందని బేతపూడి కేజీబీవీ ప్రిన్సిపాల్ సిహెచ్.భువనమాధురి అన్నారు. ఈ మేరకు స్థానిక కేజీబీవీలో ప్రపంచ నైపుణ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని బహుళ కార్యాచారణలతో ప్రత్యేక కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా భవిష్యత్‌కు వృత్తి విద్యా కోర్సులు ఏవిధంగా బాసటగా నిలుస్తాయనే సందేశంతో విద్యార్థినులు ప్లకార్డులు ప్రదర్శించారు. విద్యార్థినులకు క్విజ్, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి విజేతలకు ప్రిన్సిపాల్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. నిరుపేద బాలిక బ్యూటీ నిపుణురాలిగా మారి కుటుంబానికి ఆధారంగా నిలిచిన వైనాన్ని బహుళ పాత్రల నాటిక ప్రదర్శన ద్వారా కళ్లకు కట్టినట్టుగా చూపించారు. ఈ కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయిని దేవి, బ్యూటీ అండ్ వెల్‌నెస్ ఒకేషనల్ ట్రైనర్ లకే సునీత, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

మండుతున్న ఎండలు– ఎండుతున్న వరినారు


వీరనారాయణంలో వరినారు వేయడానికి సిద్ధం చేసిన దుక్కుమడి

మాడుగుల రూరల్ : వర్షాభావ పరిస్థితులతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గత పది రోజులుగా కాస్తున్న ఎండలకు వరినారు పూర్తిగా ఎండిపోతుంది. ఈ నెల మొదటి వారంలో అడపాదడపా కురిసిన వర్షాలకు రైతులు రైతు సేవా కేంద్రాల ద్వారా వరి విత్తనాలు కొనుగోలు చేసి వేశారు. నారు వేసిన తర్వాత వర్షాలు ముఖం చాటువేచడంతో విద్యుత్ మోటారు పంపుసెట్లు వున్న చోట, నీరు ఆధారం వున్న పంట భూముల్లో వేసిన వరినారును నీటితో తడుపుతున్నారు. నీటి ఆధారం లేని మెట్ట భూముల్లో వరి నారు ఎండిపోతుంది. కొన్ని గ్రామాల్లో వరినారు వేయడానికి దుక్కులు దున్ని సిద్ధంగా ఉంచారు. వాతావరణం అనుకూలంగా వుంటే వరి దమ్ములు ప్రారంభించాల్సిన సమయం ఇది. వర్షాభావ పరిస్థితుల వల్ల రైతులకు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

ఈ నెల 18న జాబ్ మేళా

నర్సీపట్నం : పెదబొడ్డేపల్లి డాన్‌బాస్కో కళాశాలలో స్కిల్ డెవలప్‌మెంట్ సహకారంతో ఈ 18న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు కళాశాల యాజమాన్యం వారు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉంటుందన్నారు. ఈ జాబ్ మేళాకు ఐసీఐసీఐ బ్యాంక్, డెక్కన్ కెమికల్స్, కియోమోటార్స్, డబ్ల్యూఎస్ఎస్, నవతా ట్రాన్స్‌పోర్టు, డి–మార్ట్ తదితర కంపెనీల ప్రతినిధులు హాజరువుతున్నారని తెలిపారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.